ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
5
బుధవారం 13 నవంబరు 2024



సర్వేకు ప్రజలు సహకరిస్తున్నారు..

- మూడురోజుల్లో 18శాతం పూర్తి
- కలెక్టర్ పమేలా సత్పతి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సమగ్ర సర్వేకు ప్రజలు సహకరిస్తున్నారని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 3,31,000 కుటుం బాలున్నట్లు గుర్తించామని, వాటిలో ఇప్పటి వరకు 60,450 కుటుంబాల సమాచారాన్ని సేకరించామన్నారు. చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తున్నామన్నారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా 1,958 ఎలక్ట్రోల్ బ్లాకులకు 1,958 మంది ఎన్యూ మరేటర్లను నియమించామని తెలిపారు. జనాభా పెరిగినందున 2,7 00 మంది ఎన్యూమరేటర్లను, 280మంది సూపర్‌వైజర్లను నియ మించి వారికి జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన కోర్‌కమిటీ మాస్టర్ ట్రైనర్లుగా వారికి శిక్షణ ఇప్పించామన్నారు. 9వ తేదీ నుంచి ఇంటింటి సర్వే కొనసాగుతోందని, ఈ మూడు రోజుల్లో 18శాతం 60,450 కుటుంబాల సమాచారాన్ని సేకరించామన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ప్రాథమిక పాఠశాలల టీచర్లు, ఆర్పీలు, పంచాయతీ సెక్రె టరీలు, జూనియర్ అసిస్టెంట్లు సహా ఇతర ఉద్యోగులు ఈ సర్వేలో ఎన్యూమరేటర్లుగా పనిచేస్తున్నారని చెప్పా రు. జిల్లాస్థాయిలో జిల్లా ప్లానింగ్, రెవెన్యూ, పంచాయతీ అధికారులు సర్వే విధులను సమన్వయం చేస్తున్నా రన్నారు. ఒక్కో ఎన్యూమరేటర్ రోజుకు 15 నుంచి 20 ఇళ్ళ సర్వే చేస్తున్నారని తెలిపారు. ఎన్యూమరేటర్లకు ఆధార్, బ్యాంకుఖాతాలకు సంబం ధించిన ఎలాంటి డాక్యుమెంట్లను ఇవ్వవద్దని, నంబర్ చెబితే సరిపోతుందని కలెక్టర్ సూచించారు. 75 అంశాలతో ప్రశ్నావళి ఉందని, అందులో ఇష్టమున్న వివరాలను మాత్రమే ఇస్తే సరిపో తుందన్నారు. సర్వే విషయంలో ప్రజల సందేహాలు, అనుమా నాలను నివృత్తి చేస్తున్నామని, త్వరలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేస్తామని, దాన్ని వినియోగించుకొని సర్వేకు సహకరించాలని కోరారు. కుటుంబ సభ్యుల అందుబాటులో లేకున్నా, డోర్ లాక్ ఉన్న ఇంటి యజమా నులకు అంగన్‌వాడీలు, ఆర్పీలు సమాచార మిస్తారని, అలాంటి వారు వీలైన సమయంలో ఎన్యూ మరేటర్లకు సమాచారమివ్వాలని సూచించారు. తప్పిపోయిన ఇళ్ల వివరాలను గుర్తించి వారి వివరాలను సేకరిస్తామని చెప్పారు. గడువులోపు సర్వే పూర్తి చేస్తామని తెలి పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, ముఖ్య ప్రణాళికాధికారి కొమురయ్య పాల్గొన్నారు.


గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లిలో ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

ఎట్టకేలకు..

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

- ఇప్పటి వరకు కొనుగోలు చేసింది 43,934 మెట్రిక్ టన్నులు
- చెల్లించింది రూ. 3.28 కోట్లు
- ఆన్‌లైన్ నమోదులో జాప్యం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఎట్టకేలకు వరి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమై ఊపందుకుంటున్నాయి. వరి కోతలు మొదలై 40 రోజులు గడువడంతో ధాన్యం ఎప్పుడు కొనుగోలు చేస్తారో తెలియని పరిస్థితుల్లో చాలా మంది రైతులు ధాన్యాన్ని మద్దతు ధర రాకున్నా ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకున్నారు. నవంబరు చివరి వరకు సుమారు 3.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని జిల్లా యంత్రాంగం అంచనా వేసింది. కొనుగోళ్ళు ఆలస్యంగా ప్రారంభం కావడంతో ఇప్పటి వరకు 44 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో, గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు, కల్లాల్లో ఇంకా పెద్ద ఎత్తున ధాన్యం కుప్పలు ఉన్నాయి. ఇప్పటికే సుమారు లక్ష టన్నుల వరకు రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకొని లక్షలాది రూపాయలు నష్టపోయారని అంచనా వేస్తున్నారు.

40 శాతానికిపైగా సన్నరకాల సాగు

జిల్లాలో వానాకాలం సీజన్‌లో 2.75,448 ఎకరాలలో వరిసాగు చేశారు. వీటిలో 1,56,948 ఎకరాలు దొడ్డు రకాలు కాగా, 1,18,500 ఎకరాల్లో సన్న రకాలను వేశారు. ప్రభుత్వం సన్నరకాల సాగును ప్రోత్సహించాలని నిర్ణయించి క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ ప్రకటించడంతో ఈ సీజన్‌లో 40శాతానికిపైగా సన్నరకాలను సాగు చేశారు. దొడ్డు రకాలకు చెందిన ధాన్యం దిగుబడి ఎకరాకు 2.092 టన్నులు, సన్నరకాలు 2.047 టన్నులు వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఈ మేరకు 3,28,335 మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం, 2,42,570 మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం దిగుబడిగా వచ్చే అవకాశం ఉంది. దొడ్డు రకం ధాన్యం మొత్తం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయిస్తారు. సన్నరకాల్లో 55,374 మెట్రిక్ టన్నులు రైతులు విత్తన అవసరాల కోసం, 75,471 టన్నులు స్థానిక అవసరాల కోసం ఉంచుకొని 1,11,725 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తారని అధికారులు అంచనా వేశారు. జిల్లాలో రైతులు సన్న, దొడ్డు రకం కలిపి 4,14,282 మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయించే అవకాశముంది. అధికారులు జిల్లాలో 340 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. వీటిలో 291 కేంద్రాలు కొనుగోళ్లను ప్రారంభించాయి. ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు 2,320, కామన్ రకానికి 2,300 రూపాయలు మద్దతు ధరగా ప్రభుత్వం ప్రకటించింది. ఏ-గ్రేడ్ ధాన్యంగా కొనుగోలు చేసే సన్నరకం వరి ధాన్యానికి 2320 రూపాయలతోపాటు 500

మిగతా 8వ పేజీలో... ..


హుజూరాబాద్ మండలం బోర్నపల్లిలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న హమాలీలు

డబ్బుల చెల్లింపులో ఆలస్యం

రెండు, మూడు రోజుల క్రితమే కొనుగోళ్లు ప్రారంభం కావడంతో కొనుగోలు కేంద్రాల్లో ఈనెల 12వ తేదీ వరకు 43,934 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని మాత్రమే కొన్నారు. 6,529 మంది రైతులకు చెందిన ఈ ధాన్యం విలువ 101.93 కోట్ల రూపాయలు. కొనుగోలు చేసిన ధాన్యంలో ఇప్పటి వరకు కేవలం 210 మంది రైతులకు చెందిన 1,414 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించిన 3.28 కోట్లు మాత్రమే సివిల్ సప్లయిస్ శాఖ చెల్లించింది. 43,934 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొ నుగోలు చేసినా 12,583 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించిన వివరాలను మాత్రమే ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయగలిగారు. వీటిలోనూ 2,675 మెట్రిక్ టన్నుల ధాన్యానికి ట్రక్ చిట్ జనరేట్ చేశారు. 1,548 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే తమ మిల్లులకు చేరినట్లు ఇప్పటి వరకు మిల్లర్లు కన్‌ఫర్మ్ చేశారు. దీనిలోనుంచే 1,414 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సివిల్ సప్లయిస్ శాఖ 3.28 కోట్లు చెల్లించింది. రైతుల వద్ద ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన 98.65 కోట్ల రూపాయలు ఇంకా చెల్లించాల్సి ఉన్నది. రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే డబ్బు చెల్లిస్తామని పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పదేపదే చెబుతున్నా ఆచరణలో అది నెరవేరడం లేదు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి, 24 గంటల్లో తమ ఖాతాల్లో డబ్బు జమచేసేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

పీహెచ్‌సీలను పరిశీలించిన డీఎంహెచ్‌వో

సుభాష్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ జిల్లాలోని పలు పట్టణ ఆరోగ్యకేంద్రాలతోపాటు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంగళవారం సందర్శించారు. జిల్లా కేంద్రంలోని విద్యానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళా కార్యక్రమానికి హాజరైన వారితో మాట్లాడారు. వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం చొప్పదండి కమ్యూనిటీ హెల్త్ సెంటర్, తీగలగుట్టపల్లిలోని బస్తీ దవాఖాన, గుమ్లాపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఓపీ సేవలు, రక్త పరీక్షలు, ఫార్మసీల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ సురేందర్, డాక్టర్ సాహితి, డాక్టర్ సనా జువేరియా పాల్గొన్నారు.

'కళాభారతి'కి
ఆధునిక హంగులు
- 14న ప్రారంభించేందుకు ఏర్పాట్లు
7
కరీంనగర్ టౌన్, ఆంధ్రజ్యోతి

చలికాలం..
చిన్నారులు భద్రం
- వ్యాక్సిన్ల విషయంలో నిర్లక్ష్యం వద్దు
6
హుజూరాబాద్‌రూరల్, ఆంధ్రజ్యోతి

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

- విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు



కరీంనగర్ కల్చరల్, నవంబరు 12: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లయ్య నేతృత్వంలో కార్యదర్శి ఎ సరిత, సిబ్బంది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వివిధ స్థాయిల విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి చివరి రోజున ప్రశంసా పత్రాలు, బహుమతులు ప్రదానం చేయనున్నారు. వారోత్సవాల సందర్భంగా సభ్యులు ఇంటికి తీసుకెళ్లి చాలా కాలంగా తిరిగి ఇవ్వని పుస్తకాలు తిరిగి గ్రంథాలయంలో ఇస్తే ఎలాంటి ఆలస్య రుసుము వసూలు చేయరని చైర్మన్, అధికారులు తెలిపారు.

కార్యక్రమాల వివరాలు..

14న ఉదయం 10 గంటలకు ఉత్సవాల ప్రారంభం, 11.30కు 'పర్యావరణం' అంశంపై ఐదు నుంచి ఏడో తరగతి విద్యార్థులకు చిత్రలేఖనం, మధ్యాహ్నం 12.30.కు మెమోరీ గేమ్ నిర్వహిస్తారు. 15న ఉదయం 10 గంటలకు 'పుస్తక ప్రదర్శన', 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 'భారతదేశ పుణ్య క్షేత్రాలు' అంశంపై వ్యాసరచన పోటీ, మధ్యాహ్నం 12 గంటలకు కళాశాల విదార్థినీ విద్యార్థులకు 'నూతన విద్యా విధానం' అంశంపై వ్యాసరచన పోటీ ఉంటుంది. 16న ఉదయం 11 గంటకు 7, 8 తరగతి విద్యార్థులకు 'క్విజ్, 17న ఉదయం 11 గంటలకు 8, 9 తరగతుల విద్యార్థులకు 'మేక్ ఇన్ ఇండియా' అంశంపై, మధ్యాహ్నం 12 గంటలకు కళాశాల విద్యార్థులకు 'ప్రపంచశాంతి-భారతదేశ పాత్ర' అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహిస్తారు. 18న ఉదయం 11 గంటలకు పాఠశాల, కళాశాల విద్యార్థులకు 'దేశభక్తి, జానపద' గేయాలపై పాటల పోటీ, 19న ఉదయం 11 గంటలకు పాఠశాల, కళాశాల విద్యార్థినులకు 'రంగోలి, మెహందీ' పోటీలు, 20న ఉదయం 11 గంటలకు 'ముగింపు వేడుక' ఉంటుంది.

విద్యార్థులకు సూచనలు...

ప్రతీ పాఠశాల, కళాశాల నుంచి నలుగురు ఎంపిక చేసిన విద్యార్థులు మాత్రమే ధ్రువీకరణ పత్రాలతో పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుంది. వ్యాసరచన, వక్తృత్వ పోటీలు తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో నిర్వహిస్తారు. పోటీ సమయానికి గంట ముందు పేర్లను నమోదు చేసుకోవాలి. రంగోలి, మెహందీ పోటీల్లో పాల్గొనే విద్యార్థినులు సామగ్రి తెచ్చుకోవాలి. ఇతర వివరాలకు 9441758549, 9494494328, 9494361243 నంబర్లలో సంప్రదించాలి

ఉత్సవాలను విజయవంతం చేయాలి...

- సత్తు మల్లేశం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

గురువారం నుంచి జరిగే ఉత్సవాలను విజయవంతం చేయాలి. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గ్రంథాలయాలు పూర్వ వైభవాన్ని సంతరించుకోను న్నాయి. పోటీలు, ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ఉద్యోగులపై దాడి ఖండనీయం


కలెక్టరేట్ ఆవరణలో ఉద్యోగుల నిరసన ప్రదర్శన

సుభాష్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ కలెక్టర్ ప్రతిక్ జైన, కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటి ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డితోపాటు విధి నిర్వ హణలో ఉన్న సిబ్బందిపై కొందరు వ్యక్తులు దాడి చేయడం ఖండనీయమని ఎంప్లా యీస్ జేఏసీ చైర్మెన్ దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో జేఏసీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులకు తగిన భద్రత కల్పించాలన్నారు. కలెక్టర్లకు ఉన్న భద్రతను గత ప్రభుత్వం తొలగించడం బాధాకరమన్నారు. ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే దానికి పరిష్కారా మార్గాలు అనేకం ఉన్నాయన్నారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేయడం అప్రజాస్వామిక మన్నారు. ఈ సంఘటనవల్ల ప్రభుత్వ ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారని, వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలన్నారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఎంతపెద్ద వారు ఉన్నా ఉపేక్షించకూడదని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపెల్లి కాళీచరణ్, నాగుల నరసింహస్వామి, నాగరాజు, రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్‌రెడ్డి, ముప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఒంటెల రవీందర్ రెడ్డి, ఒంటెల ప్రసాద్‌రెడ్డి, గంగారపు రమేశ్, మల్కా రాజేశ్వర్‌రావు, సర్దార్ హర్మిందర్ సింగ్, సుమంత్‌రావు, నేరెళ్ల కిషన్, రాజేశ్‌భరద్వాజ్, కొండయ్య, విజయ్, పోలు కిషన్, శారద, సునీత, సరిత, శైలజ, బల్బీర్‌సింగ్, జలాలుద్దీన్‌అక్బర్, భూమన్న, హాస్టర్ ప్రవీణ్ రావు, రాజిరెడ్డి, ఖాజా మొయినొద్దీన్, సత్యం, శ్రీనివాస్, కర్ణాకర్, సుధాకర్‌రెడ్డి, వాస్తవిక్, రవి, జడ కరుణాకర్, కోట రామస్వామి, వెంకటయ్య, కమ్రుద్దీన్, కమలేష్, సోమన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాలతో డీఈవో చర్చలు విఫలం

కరీంనగర్ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): డీటీఎఫ్, టీపీటీఎఫ్ ప్రతినిధులతో జిల్లా విద్యాశాఖ అధికారి సిహెచ్‌వీఎస్ జనార్ధన్‌రావు జరిపిన చర్చలు విఫలమ య్యా యి. దీంతో బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆ రెండు సంఘాల సంయుక్త ధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన ధర్నా యథాతథం కొనసాగుతుందని బాధులు వి రాజిరెడ్డి, మాడుగుల రాములు, నరహరి, దామోదర్‌రెడ్డి, తూముల తిరుపతి ఓ ప్రకటనలో తెలి పారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

వామ్మో.. కొండచిలువ



ఇంటి నుంచి బయటకు వెళుతున్న కొండచిలువ

ఎల్లారెడ్డిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేటలోని గంట కుశయ్యగౌడ్ ఇంటిలో మంగళవారం కొండ చిలువ ప్రత్యక్షమైంది. దీంతో కుటుంబసభ్యులు భయంతో పరుగులు తీశారు. సుమారు రెండు గంటలపాటు కొండ చిలువ ఇంట్లో అటూ, ఇటూ తిరిగింది. కొందరు యువకులు కర్ర సాయంతో బయటకు పంపించి హతమార్చారు.

యూరప్‌లో ఉద్యోగం పేరిట రూ. 3.50 లక్షలు వసూలు

ఆర్మీనియా నుంచి తిరిగి వచ్చిన అయిత్‌పల్లి వాసి

ఏజంట్ మోసంపై ప్రవాసీ ప్రజావాణిలో ఫిర్యాదు



ప్రవాసీ ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న రాములు

పెగడపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : యూరప్‌లో ఉద్యోగం పేరిట నమ్మించి రూ. 3.50 లక్షలు వసూలు చేసి ఆర్మీనియా తీసు కెళ్లి తిరిగి పంపించగా బాధితుడు రాములు తనకు న్యాయం చేయాలని కోరుతూ ప్రవాసీ ప్రజావాణిలో మంగళవారం ఫిర్యాదు చేశాడు. పెగడపల్లి మండలం అయిత్‌పల్లి గ్రామానికి చెందిన కూన రాములు జగిత్యాలకు చెందిన ఒక లైసెన్సుడు ఏజంట్ మాటలు నమ్మి ఉద్యోగంపై ఆశతో రూ. మూడున్నర లక్షలు చెల్లిం చానని, తనను గత సంవత్సరం సెప్టెంబరు 25న ఆర్మీనియా దేశానికి తీసుకెళ్లి వదిలేశాడని, అక్కడ ఉద్యోగం లభించక జనవరిలో తిరిగి ఇంటికి వచ్చానని ఇంటికి రావడానికి తనకు మళ్లీ రూ. 1.45 లక్షలు ఖర్చయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు ప్రభు త్వం న్యాయం చేయాలని వేడుకున్నాడు.

రోడ్డుపై పడిపోయిన ధాన్యం బస్తాలు..



సంచులను చూపిస్తున్న మహిళా రైతు

శంకరపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మం డలం కేశవపట్నం పోలీస్ స్టేషన్ ఎదురుగా మంగళవారం వడ్ల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌లోని ధాన్యం బస్తాలు రోడ్డుపై పడిపోయాయి. మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ రైతు కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని విక్రయించారు. వడ్ల లోడ్‌తో ఉన్న ట్రాక్టర్ కన్నాపూర్ నుంచి బయలుదేరి కేశవపట్నం రైస్‌మిల్‌కు తరలిస్తుండగా కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై కేశవపట్నం పోలీస్ స్టేషన్ ఎదుట ధాన్యం బస్తాలు కూలి రోడ్డుపై పడ్డాయి. పాత సంచులలో ధాన్యం పోసి తూకం వేయడంతో రోడ్డు మీద పడి ధాన్యం బస్తాలు చిరిగి పోయాయి. రోడంతా ధాన్యం చెల్లాచెదురుగా పడిపోవడంతో సదరు రైతు కుటుంబం వచ్చి ధాన్యాన్ని సంచుల్లో పోసి మళ్లీ ట్రాక్టర్‌లో వేసుకొని మిల్లుకు తరలించారు. ధాన్యం బస్తాలు రోడ్డు మీద పడ్డ సమయంలో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కన్నాపూర్ గ్రామానికి చెందిన మరో ట్రాక్టర్ కేశవపట్నం రైస్ మిల్లుకు వస్తుండగా ముత్తారం శివారులో రోడ్డు పై ధాన్యం బస్తాలు కూలిపోయాయి.

హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో ఒకేరోజు 13 ప్రసవాలు



హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో చిన్నారులతో కుటుంబ సభ్యులు

హుజూరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో ఒకే రోజు 13 మంది గర్భిణులకు ప్రసవాలు మంగళవారం నిర్వహించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజేందర్ రెడ్డి, ఆర్ఎంవో సుధాకర్‌రావులు తెలిపారు. రెండ్రోజుల క్రితం నెలలు నిండిన మహిళలు హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి రాగా, వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ పి నిచ్చలారెడ్డి, సోమశేఖర్, వాణిలత ఆపరేషన్లు నిర్వహించారు. ఒకేరోజు 13 ప్రసవాలు జరగడంతో వైద్య సిబ్బందిని పలువురు అభినందించారు.

చలికాలం చిన్నారులు భద్రం



జాగ్రత్తలివే..

రాత్రి వేళ చల్లని గాలులు గదిలోకి రాకుండా చూసుకోవాలి. బయట చలిగా ఉన్న సమయంలో పిల్లలను ఎక్కువ సమయం బయట గడపకుండా జాగ్రత్త వహించాలి. వెచ్చగా ఉండేందుకు మందంగా ఉండే దుస్తులు లేదా స్వెట్టర్లు ధరింపజేయాలి. తలకు మఫ్లర్ (టోపి), చేతులకు గ్లౌజులు, పాదాలకు సాక్స్ వంటి అదనపు రక్షణ దుస్తులు ధరించాలి. చలికాలంలో ముఖం, చేతులు, పాదాలు, మడమలు పగిలిపోవడం సాధారణం. చలి కాలంలో మాయిశ్చరైజర్లు వాడాలని వైద్యులు సూచిస్తున్నారు. వేడి నీటితో స్నానం చేయించాలి. ఆ తర్వాత పొడిగా ఉండే దుస్తులను వేయాలి.

వ్యాక్సిన్ల విషయంలో నిర్లక్ష్యం వద్దు

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 12 : చలికాలం వచ్చిందంటే అందరికి జలుబు, దగ్గు, జ్వరం వంటి సమస్యలు తలెత్తుంటాయి. ఈ కాలంలో వైరస్, బ్యాక్టీరియా సులభంగా వ్యాప్తి చెందుతాయి. చిన్న పిల్లలు తరుచూ జబ్బుల బారిన పడుతుంటారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే రాత్రి వేళల్లో చలి అధికంగా ఉంటోంది. రాబోయే మూడు నెలలు చలి తీవ్రత మరింత ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖాధికారులు ఇప్పటికే హెచ్చరించారు.ఈ నేపథ్యంలో పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాల్సి ఉంది. పిల్లలకు వేసే వ్యాక్సిన్ల విషయంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయొద్దు. ఇన్‌ఫ్లుయెంజా వ్యాక్సిన్‌తో పిల్లలకు దగ్గు, జలుబు, జ్వరం రాకుండా ఉంటుంది. వీటిని ఏడాదికి రెండు సార్లు వేస్తారు. ఆ తరువా ఐదేళ్ల వరకు ప్రతి సంవత్సరం ఒక్కొక్కటి చొప్పున తీసుకోవాలి. సీజనల్ టీకాలు వేయించాలి.

పరిశుభ్రత కీలకం

చలికాలంలో చిన్న పిల్లలు ఉండే గదులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలి. చల్లని వాతా వరణం కావడంతో అనేక వైరస్‌లు విజృంభిస్తాయి. పిల్లలు పాఠశాల నుంచి వచ్చిన తర్వాత అల్పాహారం తీసుకునే ముందు చేతులు, కాళ్లు బాగా కడగాలి. విటమిన్-సీ, ఐరన్, జింక్ వటిమినరల్స్ అధికంగా ఉన్న ఆహారాన్ని అందిస్తే రోగ నిరోధక శక్తి పెంపొందుతుంది. పండ్లు, కూరగాయాలు, గోధుములు, నాటుగుడ్లు వంటివి అందులో చేర్చాలి. చలికాలంలో శరీరానికి చెమట ఎక్కువగా పట్టనందున పిల్లలు తక్కువ నీరు తాగుతుంటారు. వారితో ఎక్కువ నీరు తాగించాలి. వీలైనంత వరకు గోరు వెచ్చని నీరు అందించాలి.

పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి..

డాక్టర్ మధుకర్, చెల్పూర్ పీహెచ్‌సీ



చలికాలంలో చిన్న పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. వాతావరణంలోని మార్పులు, చల్లని గాలులతో పిల్లలకు జ్వరంతో పాటు శ్వాస కోస సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఒక్కోసారి జలుబు అధికమైతే పిల్లలకు ఆయాసం వచ్చే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో వెంటనే వైద్యులను సంప్రదించాలి. సాధారణంగా జబ్బు చేసిన ప్రతిసారి వారికి యాంటీబయోటిక్స్ ఇస్తుంటారు. యాంటీ బయాటిక్స్ ఎక్కువ తీసుకుంటే సహాజమైన రోగ నిరోధక శక్తి తగ్గిపోతుంది. సకాలంలో వైద్యులను సంప్రదించి తగిన వైద్యం అందించాలి.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడి మృతి

రామడుగు, నవంబరు 12: మండలంలోని వెదిర గ్రామానికి చెందిన ఎండీ హుస్సేన్(70) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం..గ్రామానికి చెందిన ఎండి హుస్సేన్ ఈ నెల 8న రాత్రి బస్సు దిగి రోడ్డు దాటుతున్న క్రమంలో జగిత్యాల నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడు అతివేగంగా వచ్చి ఢీ కొట్టాడు. తీవ్రంగా గాయపడ్డ హుస్సేన్‌కు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. హుస్సేన్ కుమారుడు ఎండి అమీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ధర్మపురి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణానికి చెందిన మూటపల్లి నవీన్(34) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు. నవీన్‌కు 13 ఏళ్ల క్రితం లావణ్యతో పెళ్లి అయినట్లు ఆయన పేర్కొన్నారు. దంపతులకు ఒక బాబు ఉన్నాడు. 8 ఏళ్ల క్రితం భార్య తన కొడుకుతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మానసికంగా బాధపడుతూ ఈనెల 11న ధర్మపురిలో పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పావుగంటలో ఇళ్లకు చేరుతామనేలోపే..

- రోడ్డు దాటుతున్న మహిళా కూలీలను ఢీకొట్టిన కారు
- ఇద్దరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం



భాగ్యమ్మ, అమృత(ఫైల్)

పెద్దపల్లిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పావుగంటలో ఇళ్లకు చేరుతామనుకునేలోపే.. కారు రూపంలో మృత్యువు వారిని కబళించింది. కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నలుగురు మహిళలు, పనులు ముగించుకొని తెల్లవారుజామున ఇంటికి వెళుతుండగా వేగంగా వచ్చిన కారు వారిని ఢీకొట్టింది. దీంతో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మరో మహిళ స్వల్ప గాయాలతో బయటపడింది. ఈ ఘటన మంగళవారం తెల్లవారు జామున జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పెద్దపల్లి పట్టణంలోని ఉదయ్‌నగర్‌కు చెందిన నలుగురు మహిళలు కుక్క భాగ్యలక్ష్మి, కుక్క అమృత, కుక్క పద్మ, కుక్క కాంతమ్మలు సోమవారం ఓ ఫంక్షన్ హాల్‌లో వంట పనులు, పాత్రలు శుభ్రపరిచే పనులకు వెళ్లారు. అయితే రిసెప్షన్ అర్ధరాత్రి దాటే వరకు కొనసాగింది. దీంతో వీరిని పనులకు తీసుకున్న వ్యక్తి మంగళవారం ఉదయం 3 నుంచి 4 గంటల ప్రాంతంలో నలుగురు మహిళలను ఇంటికి పంపించారు. ఆక్రమంలో ఫంక్షన్ హాల్ వద్ద ఉన్న రాజీవ్ రహదారి దాటుతుండగా కరీంనగర్ వైపు నుంచి వస్తున్న కారు నలుగురు మహిళలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కుక్క భాగ్యలక్ష్మి(50), కుక్క అమృత (49) అక్కడికక్కడే మృతిచెందారు. కుక్క పద్మ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించారు. కాంత మ్మ స్వల్ప గాయాలతో బయటపడింది. వీరంతా ఒకే వీధికి చెందిన వారు కావడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలాన్ని సీఐ ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. సంఘటన స్థలంలో లభించిన విడి భాగాల ఆధారంగా కారు ఢీకొనడం వల్లనే ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రమాదానికి కారణమైన కారు ఆగకుండా వెళ్లిపోవడంతో పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. కుక్క రాజేశం ఫిర్యా దు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సుల్తానాబాద్, గోదావరిఖని ప్రాంతాలకు రెండు బృందాలను పంపినట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. మృతురాలు అమృతకు భర్త నర్సయ్య, కూతురు, కొడుకు ఉన్నారు. భాగ్యకు భర్త కనుకయ్య, నలుగురు కూతుళ్లు ఉన్నారు.

చెరువులో దూకి వృద్ధుడి ఆత్మహత్య

జగిత్యాల క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) :అనారోగ్య కారణంతో చింత కుంట చెరువులో దూకి ఓ వృద్ధుడు మంగళవారం ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. పట్టణంలోని టీట్ బజార్ ప్రాంతానికి చెందిన పల్లెర్ల కిషన్(70) కొన్ని రోజులుగా బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్నాడు. తీవ్ర మనస్తాపానికి గురైన కిషన్ సమీ పంలో ఉన్న చింతకుంట చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కిషన్ కుమారుడు వినయ్ ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బావిలోకి దూకి వృద్ధురాలు..

కరీంనగర్ క్రైమ్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్‌కు చెందిన మెంతి పుల్లమ్మ (80) బావిలో దూకి ఆత్మహత్య చేసుకుందని కరీంనగర్ పోలీసులు తెలిపారు. పుల్లమ్మ కొంతకాలంగా మానసిక సమస్యలతో అనా రోగ్యంతో బాధపడుతుందని, ఈ క్రమంలోనే సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం పుల్లమ్మ కుటుంబ సభ్యులు వెతకగా వారి వ్యవసాయ బావిలోనే మృతదేహం గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతురాల కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

తొమ్మిది మంది అరెస్ట్

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగిరెడ్డిపల్లె గ్రామ శివారులో పేకాట స్థావరంపై మంగళవారం రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రమేష్ బాబు, ఎస్సై రాజేష్‌లు గోదావరిఖని టూటౌన్ సిబ్బందితో కలిసి రహ్య స్థావరంపై దాడి చేశారు. డబ్బులు పెట్టి పేకాట ఆడుతున్న తొమ్మిది పట్టుబడగా, ఇద్దరు పరారయ్యారు. వారి వద్ద నుంచి రూ. 71,690 నగదును పోలీ సులు స్వాధీనం చేసుకున్నారు. నగదుతో పాటు తొమ్మిది మొబైల్ ఫోన్లు, నాలుగు బైక్‌లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని విచారణ నిమిత్తం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

ఇసుక డంపులు సీజ్

4 ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలింపు

ఇబ్రహీంపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమటికొండపూర్ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. 4 ట్రాక్టర్‌లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కోమటికొండపూర్ గ్రామంలో అక్రమంగా ఇసుక డంపులు ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఇబ్రహీంపట్నం తహసీల్దార్ ప్రసాద్ ఆదేశాలతో ఆర్ఐలు రేవంత్‌రెడ్డి, రమేష్, మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం పోలీసులు గ్రామంలో దాడులు నిర్వహించారు. 2 చోట్ల అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను గుర్తించి దాదాపుగా 35 ట్రాక్టర్ల ఇసుక డంపులను సీజ్ చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. 4 ట్రాక్టర్ ట్రాలీలను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయంలో రైతు ఆత్మహత్యాయత్నం

తల్లి పేరున భూమి విరాసత్‌ను నిలిపివేయాలని పురుగుల మందు తాగిన వైనం



రోదిస్తున్న రైతు రవి

మానకొండూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని దేవంపల్లి గ్రామానికి చెందిన కొయ్యెడ రాజమ్మ-లచ్చయ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు రవి, హరీష్ ఉన్నారు. గ్రామంలో లచ్చయ్య పేరు మీద సర్వే నెంబరు 185బి, 196సిలో మూడెకరాల 12 గుంటల భూమి ఉంది. లచ్చయ్య రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. లచ్చయ్య పేరున ఉన్న భూమిని తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి మూడు రోజుల క్రితం భార్య రాజమ్మ స్లాట్ బుక్ చేసుకుంది. తల్లి రాజమ్మ, తమ్ముడు హరీష్ ఒక్కటై భూమిని పంచకకుండా తల్లి పేరున విరాసత్ చేసుకుంటున్నదని పెద్ద కుమారుడు రవి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భూమిని తల్లి పేరు మీద విరాసత్ చేయవద్దనిమంగళవారం తహసీల్దార్ బి రాజేశ్వరిని కలిసి కోరాడు. దీంతో తహసీల్దార్ విరాసత్ చేయనని అతడికిచెప్పారు. అప్పటికే మనస్తాపంతో ఉన్న రవి తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి బోరున విలపించి కింద పడిపోయాడు. స్పందించిన రెవెన్యూ సిబ్బంది చికిత్స నిమిత్తం 108కు సమాచారం ఇవ్వడంతో వారుకరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈవిషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా లచ్చయ్య పేరున ఉన్న మూడెకరాల 12గుంటల భూమిని విరాసత్ కోసం మూడు రోజుల క్రితం రాజమ్మ స్లాట్ బుక్ చేసుకుందన్నారు. ధరణి నిబంధనల ప్రకారం భర్త పేరు మీద ఉన్న భూమిని భార్యకు విరాసత్ చేయవచ్చని తెలిపారు. కుమారుడు రవి ఫిర్యాదు మేరకు రిజిస్ట్రేషన్ నిలిపివేశామని తహసీల్దార్ చెప్పారు.

ముద్దలుగా మారుతున్న అన్నం

- గురుకుల పాఠశాలలో అన్నం సరిగా లేక విద్యార్థుల అస్వస్థత
- ప్రిన్సిపాల్‌తో తల్లిదండ్రుల వాగ్వాదం



ముద్దలుగా అన్నం

తిమ్మాపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలోని మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల, కళాశాలలో(బాలుర)లో వారం రోజులుగా అన్నం సరిగా లేక విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు. గన్నేరువరం మండలానికి సంబంధించిన మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల, కళాశాలను రామకృష్ణకాలనీలో నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాల, కళాశాలలో 450 మంది విద్యార్థులు హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. వారం రోజుల క్రితం పాఠశాలకు సివిల్ సప్లయిస్ శాఖ నుంచి బియ్యం సరఫరా అయ్యింది. ఆ బియ్యంతో వండిన అన్నం ముద్దలుగా మారుతోంది. సిబ్బంది అదే అన్నం విద్యార్థులకు వడ్డిస్తున్నారు. ఈ అన్నం తింటున్న విద్యార్థుల్లో చాలా మందికి జీర్ణం కాకపోవడంతో కడుపు నొప్పి, వాంతులు, విరేనాలతో అస్వస్థతకు గురవుతున్నారు. ఈ విషయం బయటకు పొక్కకుండా కొందరు విద్యార్థులకు ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. మరికొందరిని విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించి ఇంటికి పంపిస్తున్నారు. మంగళవారం కొందరు తల్లిదండ్రులు పాఠశాలకు రావడంతో ఈ విషయం బయటకు పొక్కింది. ఈ సందర్భంగా తల్లిదండ్రులు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటరమణతో, సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. పిల్లలకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సివిల్ సప్లయిస్ అధికారులకు సమాచారం ఇచ్చినా సరైనా బియ్యం పంపించడం లేదని ప్రిన్సిపాల్ తెలిపారు. పాత బియ్యం అయిపోవడంతో అధికారులు కొత్త బియ్యం పంపించారన్నారు. కొద్ది రోజులుగా ఈ బియ్యంతో కొద్దిగా సమస్యలు వస్తున్నాయని, ఉన్నతాధికారులకు ఈవిషయం తెలియజేశామని తెలిపారు.



అన్నం సరిగా ఉండడం లేదని తెలుపుతున్న విద్యార్థులు

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

జగిత్యాలరూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం లోని కండ్లపల్లి గ్రామం మీదుగా బైక్ పై గంజాయి తరలిస్తున్న జగిత్యాల పట్టణా నికి చెందిన సయ్యద్ అఫ్రోజ్‌ను మంగళ వారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 583 గ్రాముల గంజాయితో పాటు బైక్, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. సీఐ మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి సరఫరా చేసే వ్యక్తుల పట్ల, గంజాయి సేవించే వ్యక్తుల ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. గ్రామాల్లో గంజాయి విక్రయించిన, సేవించిన డయల్ 100కి సమాచారం ఇవ్వాలన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

పాలకుర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని గుడిపెల్లిలో మంగళ వారం శ్రీరాముల మల్లేశం(51) అనే గీత కార్మికుడు గాయాలపాలైనట్లు తోటి గీత కార్మికులు తెలిపారు. గాయాలపాలైన మల్లేశంను చికిత్స కోసం కుటుంబ సభ్యులు పెద్దప ల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు.నిరుపేద కుటుంబానికి చెందిన మల్లేశంను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఒకరికి తీవ్ర గాయాలు

సుల్తానాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ రైస్‌మిల్లుల ప్రాంతంలో మంగళవారం బైక్‌పై వెళుతున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లికి చెందిన క్రిష్ణమూర్తి బైక్‌పై కరీంనగర్ వెళుతుండగా ట్రాక్టర్ ఢీకొంది. క్రిష్ణమూర్తిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్ తరలించారు.

ఆరోగ్యాన్నిచ్చే గేగులు

- పోషకాలు అధికం
- అందుబాటు ధరల్లో లభ్యం
- ఇష్టంగా కొనుగోలు చేస్తున్న జనం

సిరిసిల్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి మేలు చేసే గేగులు మార్కెట్‌లోకి వచ్చాయి. చక్కని రుచితో ఎక్కువ పోషకాలు కలిగిన గేగులను ప్రజలు ఎంతో ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు.

గేగులు తయారీ..

తాటిచెట్లకు ముంజల గెలలు ఉంటాయి. ఆ గెలల కాయలు లేతగా ఉన్నప్పుడు కోసి అందులోని ముంజలను తింటారు. కాయలు ముదిరాక అవి పండ్లుగా మారి రాలుతాయి. కొందరు రైతులు వాటిని ఏరి తమ పొలాల ఒడ్డున నీరు పారే ప్రాంతంలో పాతిపెడతారు. అవి మొలకెత్తి పెరుగుతున్న క్రమంలో వాటిని తవ్వితీసి ఆకులు కత్తిరించి కాండాన్ని కుండలో ఉడకబెడతారు. దోరగా అయ్యేలా కాలుస్తారు. వాటి మీది పొరను తొలగించడంతో గేగులు తయారవుతాయి.

ఎన్నో పోషకాలు..

గేగులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వాటిలో ఫ్యాట్ తక్కువగా పీచు పదార్థం ఎక్కువగా ఉంటుంది. చర్మవ్యాధులు రాకుండా, కాలేయం పెరగకుండా, మలబద్ధ నివారణకు తోడ్పడుతుంది. చక్కని రుచిగా ఉండే వంద గ్రాముల గేగులో 1.04 ప్రోటీన్లు, 0.19 శాతం ఫ్యాట్, 76.86 శాతం సుక్రోజ్, 1.66 శాతం గ్లూకోజ్, 3.15 శాతం మినరల్స్, 0.86 శాతం కాల్షియం, 0.05 శాతం పాస్ఫరస్, 11.01 ఎంజీ ఐరన్, 0.7 ఎంజీ కాపర్‌తోపాటు విటమిన్ బీ కూడా ఉంటుంది. ఇన్ని పోషకాలు ఉండే గేగుల ధరలు కూడా తక్కువే. నాలుగు, ఐదు గేగుల కట్టను రూ.15 నుంచి 20 వరకు విక్రయిస్తారు.



ఒకరి రిమాండ్

ఎల్లారెడ్డిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాల్లోని పలు ఆలయాల్లోకి చోరీకి పాల్పడిన సంఘటనల్లో సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం శిలాజీనగర్‌కు చెందిన పిట్టల అంజయ్యను రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ రమాకాంత్ మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలోని సాయిబాబా కమాన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో అంజయ్య తమను చూసి తప్పించుకునేందుకు ప్రయత్నించాడని పేర్కొన్నారు. అతడిని పట్టుకొని విచారించామన్నారు. కొంతకాలంగా ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాల్లోని ఆలయాల్లో హుండీలను ధ్వంసం చేసి డబ్బులు దొంగిలిస్తున్నట్లు విచారణలో అంగీకరించాడని వివరించారు. నెల రోజుల నుంచి ఎల్లారెడ్డిపేట, పోతిరెడ్డిపల్లి, బండలింగంపల్లి, ముస్తాబాద్ మండలంలోని పలు గ్రామాల్లోని దేవాలయాల్లో చోరీకి పాల్పడినట్లు పేర్కొన్నారు. అంజయ్య వద్ద నుంచి రూ.1500 నగదుతోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకు న్నామని తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా మహిళాశక్తి క్యాంటీన్లు

● సమగ్ర కుటుంబ సర్వే ఎక్స్‌రేలా ఉపయోగపడుతుంది

● కేటీఆర్ ఆరోపణలనుంచి తప్పించుకునేందుకే ఢిల్లీకి...

● మంత్రి పొన్నం ప్రభాకర్



ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్ కలెక్టరేట్ సమీకృత జిల్లా కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌లో తయారు చేసిన వంటకాలను ఆయన రుచి చూశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సులు నడిపేలా చర్యలు జరుగుతున్నాయని అన్నారు. మొదటి దశలో 600 బస్సులు ఐకేపీ ద్వారా కొనుగోలు చేయాలని ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. అన్ని మహిళా సంఘాలకు చేనేత చీరలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సిరిసిల్లలో యార్న్ బ్యాంక్ తీసుకురావడానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, తాను కలిసి పని చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

ఇటీవల ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుడు 50 లక్షల అప్పు చేశాడని, ఆ అప్పు తీర్చేందుకు మళ్లీ అప్పులు చేశారన్నారు. వికారాబాద్‌లో కలెక్టర్ ప్రభుత్వ ఉద్యోగిగా ప్రజల అభిప్రాయం తీసుకునేందుకు వెళ్ళగా అక్కడికి ఒక వ్యక్తి వచ్చి కలెక్టర్‌ను వేరే ప్రాంతానికి తీసుకువెళ్లి దాడి చేశాడని, ఆ వ్యక్తి వివరాలు తమ వద్ద ఉన్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నిరసన తెలిపే విధానం ఇదికాదని అన్నారు. ఐఏఎస్‌లకు రక్షణలేదని అన్నవారే రైతుల సంఘటనను ట్రోల్ చేస్తున్నారని అన్నారు. కలెక్టర్‌పై దాడి చేసినా ఊరుకొమ్మంటారా అని ప్రశ్నించారు. మల్లన్న సాగర్ భూ నిర్వాసితులపై దాడి చేసిన ఘటన మరిచిపోయారా అన్నారు. సమగ్ర సర్వేపై గ్రామీణ ప్రాంతాలలో ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 85 వేల మంది ఎన్యూమరేటర్లు సమాచారాన్ని సేకరిస్తున్నారని, బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలున్నచోటనే కులగణనపై ఇబ్బందులు సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారని మంత్రి విమర్శించారు. సర్వేలో ప్రజలు తెలిపే సమాచారం గోప్యంగా ఉంటుందని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీలాగా వ్యవహరిస్తున్నాయని, ఇందులో భాగంగా తనపై వస్తున్న ఆరోపణల నుంచి తప్పించుకునేందుకు కేటీఆర్ ఢిల్లీ వెళ్లారన్నారు.

తాను బండి సంజయ్ మాదిరిగా జైలుకు పంపుతాం... జైలులో గది నిర్మించాం... అనడంలేదని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని, రైస్‌మిల్లర్లు ప్రభుత్వ కొనుగోలులో భాగస్వాములు కావాలని సూచించారు. మిల్లరు ప్రభుత్వానికి చెల్లించాల్సిన 20 వేల కోట్లు బకాయిల లెక్క అప్పగించాలని, లేదంటే ఉపేక్షించేదిలేదన్నారు. పత్తి కొనుగోళ్లు కేంద్రప్రభుత్వం చేస్తుందని, ఎక్కడ ఇబ్బంది తలెత్తినా ఇద్దరు కేంద్ర మంత్రులదే బాధ్యత అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో మహేశ్వర్ పాల్గొన్నారు.

కళాభారతికి ఆధునిక హంగులు

● చురుకుగా సాగుతున్న ఆడిటోరియం ఆధునీకరణ పనులు ● 14న ప్రారంభించేందుకు ఏర్పాట్లు

కళాభారతి.. కరీంనగర్ నడిబొడ్డున.. బస్టాండ్‌కు సమీపంలో 40 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఆడిటోరియం.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాకారులు కళాభారతిలో వేల ప్రదర్శనలు ఇచ్చారు. నామమాత్రపు రుసుముతో అందరికీ అందుబాటులో ఉండే ఈ ఆడిటోరియం పదేళ్లుగా కళావిహీనంగా మారింది. కళాభారతిని మూసి వేసి కార్పొరేషన్ ఎలక్ట్రిసిటీ విభాగం గోదాముగా వాడారు. ఇది చూసి కళాకారులు తీవ్రంగా బాధపడ్డారు. ఇటీవల కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి కళాభారతిని సందర్శించి ఆధునీకరించాలని ఆదేశించారు. దీంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 14న ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కళాభారతికి పూర్వ వైభవం వస్తుండడంతో కళాకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కరీంనగర్ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలోని కళాభారతి ఆడిటోరియానికి మళ్లీ మంచి రోజులు రానున్నాయి. పదేళ్ల తర్వాత కళాభారతి నూతన హంగులతో ప్రారంభోత్సవానికి ముస్తాబవుతోంది. ఒకప్పుడు కళాకారులతో కళకళలాడిన కళాభారతిని తర్వాత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఇటీవల కలెక్టర్ పమేలా సత్పతి కళాభారతి సందర్శించారు. ఆడిటోరియంను ఆధునీకరించాలని అధికారులను ఆదేశించి అవసరమైన నిధులను కేటాయించారు. నవంబరు 14 బాలల దినోత్సవం వరకు పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. కళాభారతిలోనే బాలల దినోత్సవాన్ని నిర్వహించాలని ఆదేశించడంతో పనులు వేగంగా సాగుతున్నాయి.

పదేళ్లుగా నిరుపయోగం

నగర నడిబొడ్డున, బస్టాండ్‌కు అతిచేరువలో జిల్లా నలుమూలల నుంచి వచ్చే వారికి అందుబాటులో ఉన్న కళాభారతి ఆడిటోరియంను పదేళ్ల క్రితం మూసి వేశారు. ప్రస్తుతం నగరపాలక సంస్థ ఎలక్ట్రికల్ విభాగానికి సంబంధించిన సామగ్రిని ఉంచేందుకు వినియోగిస్తున్నారు. దీనితో ప్రభుత్వ పరంగా నిర్వహించే సమావేశాలు, కార్యక్రమాలకు జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంను వినియోగిస్తున్నారు. ప్రైవేట్‌గా నిర్వహించే కార్యక్రమాలకు వేదికే లేకుండా పోయింది. హోటళ్లు, ఫంక్షన్‌హాల్స్, ఫిలింభవన్, ప్రెస్‌భవన్ వంటి వాటిని అద్దెకు తీసుకొని సంస్కృతిక కార్యక్రమాలు, సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. స్మార్ట్‌సిటీగా రూపుదిద్దుకుంటున్న కరీంనగర్‌లో అత్యాధునిక హంగులతో



ఆడిటోరియంపైన వేస్తున్న కొత్త షీట్లు

ఆడిటోరియం నిర్మించాలని కళాకారులు, కవులు, రచయితలు, ప్రజల నుంచి విజ్ఞాపనలు వెల్లువెత్తాయి. 500 సీటింగ్ కెపాసిటీతో ఉన్న కళాభారతి ఆడిటోరియంను కూల్చివేసి ఈ స్థలంలో నూతన ఆడిటోరియం నిర్మించడం కంటే, ఇక్కడ షాపింగ్ కాంప్లెక్సు లేదా నగరపాలక సంస్థ పార్కింగ్ స్థలంతోపాటు గ్రీనరీ ఏర్పాటు చేస్తే బాగుంటుందని భావించారు. దీంతో కళాభారతి మూలన పడింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ పమేలా సత్పతి కళాభారతి ఆడిటోరియంను ఆధునీకరించాలని ఆదేశిస్తూ 11 లక్షలను కేటాయించడంతో పనులు చేపడుతున్నారు. అవసరమైతే మరిన్ని నిధులు కేటాయిస్తామని తెలిపారు. దీంతో పనులు ప్రారంభమై ఊపందుకున్నాయి. కళాభారతికి పునర్వైభవం వస్తుండడంతో కళాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

40 సంవత్సరాల చరిత్ర

ఆడిటోరియంలో 400 సీటింగ్‌తోపాటు ముందు రెండు వరుసల్లో వీఐపీ కుర్చీలు, చక్కటి వేదిక, లైటింగ్, సౌండ్స్, సీలింగ్, ఏసీలు, మహిళలు, పురుషులకు వేర్వేరు మేకప్ గదులు, మరుగుదొడ్లను నిర్మిస్తున్నారు. నవంబర్ 14న పునఃప్రారంభించి మిగిలిన పనులను కూడా పూర్తి చేస్తామని చెబుతున్నారు. దీంతో కళాభారతి ఆడిటోరియంకు మళ్లీ కళ సంతరించుకోనున్నది. 40 సంవత్సరాల క్రితం నిర్మించిన కళా భారతి ఆడిటోరియం వందల సంఖ్యలో సంస్కృతిక కార్యక్రమాలు, సభలు, సమావేశాలు, కళలు, కళాకారుల ప్రదర్శనలకు వేదికగా నిలిచింది. కరీంనగర్ ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో నామమాత్రపు చార్జీలతో నగరపాలక సంస్థ ఈ ఆడిటోరియంను అద్దెకివ్వడంతో నెలలో 20 రోజులపాటు వివిధ కార్యక్రమాలతో కిటకిటలాడేది. సెలవురోజుల్లో ఉదయం, సాయంత్రం వేర్వేరు కార్యక్రమాలు కూడా జరిగిన సందర్భాలు ఉండేవి. అలాంటి 'కళా భారతి' ఆడిటోరియం శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం గోడౌన్‌గా మారింది.

జాతీయ స్థాయిలో విద్యార్థులకు గుర్తింపు



మాట్లాడుతున్న డీన్ జల్లా సత్యనారాయణ

తంగళ్లపల్లి జులై 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ కళాశాల విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు లభించడం గర్వ కారణమని డీన్ జల్లా సత్యనారాయణ అన్నారు. మంగళవారం తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామ శివారులోని బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళశాలలో విలేకరు సమావేశంలో మాట్లాడారు. ఏటా రాష్ట్రంలోని వ్యవసాయ కళాశాలలో కల్చరల్ మీట్ నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా జిల్లెల్లలో కళాశాలలో ఏర్పాటు చేశామని తెలిపారు. పార్లమెంట్ నూతన భవనం ప్రారంభోత్సవానికి తెలంగాణ వ్యవసాయ కళాశాలలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థుల్లో స్నేహభావం పెంపొందించడతో పాటు ప్రతిభను వెలికి తీయడానికి కల్చరల్ మీట్ దోహద పడుతుందన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జాతీయ స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. సమావేశంలో బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ శ్రీదేవి పాల్గొన్నారు.

ఇసుక లారీలను పట్టుకున్న విజిలెన్స్ అధికారులు



ఆర్టీవో కార్యాలయం వద్ద ఉన్న ఇసుక లారీలు

పెద్దపల్లి, నవంబర్ 11(ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ ప్రాంతంలోని ఇసుక క్వారీల నుంచి ఓవర్ లోడ్‌తో వెళుతున్న ఎనిమిది ఇసుక లారీలను పెద్దపల్లి శివారులో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు పట్టుకున్నారు. లారీల్లో వాటి సామర్థ్యానికి మించి ఇసుకను తరలిస్తు న్నట్లు సదరు అధికారులు గుర్తించారు. నిర్మల్, వికారాబాద్, సంగారెడ్డి, జహీరాబాద్‌కు ఇసుకను లారీల్లో తీసుకవెళుతున్నారు. లారీలను పెద్దపల్లి ఆర్టీవో కార్యాలయం వద్దకు తరలించి అధికారులకు అప్పగించారు. వీటిపై రాత్రి 8 గంటల వరకు కేసులు నమోదు చేయడం గానీ, జరిమానాలు విధించడం గానీ విజిలెన్స్ అధికారులు చేయలేదు.

రాష్ట్రస్థాయి వ్యవసాయ కళాశాలల కల్చరల్ మీట్



విద్యార్థులతో డీన్ సత్యనారాయణ

తంగళ్లపల్లి నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వ్యవసాయ కళాశాలల కల్చరల్, లీటరరీ మీట్‌ను రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలోని బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాలలో మంగళవారం ప్రారంభించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చరల్ యూనివర్సిటీ డీన్ జల్లా సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేశారు. మూడు రోజుల పాటు జరిగే కల్చరల్ మీట్‌లో రాష్ట్రంలోని 11 వ్యవసాయ కళశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు పాల్గొననున్నారు. మంగళవారం ఆడిటోరియంలో నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ రమేశ్ పాల్గొన్నారు.

కలపతో మహనీయుల చిత్రాలు





చారి చెక్కిన అంబేద్కర్, కేసీఆర్ చిత్రాలు

కలపపై చిత్రాలు చెక్కుతూ అబ్బుర పరుస్తున్నాడు ఆ యువకుడు. వృత్తిరీత్యా వడ్రంగి కావడంతో కర్రలపై చిత్రాలు చెక్కడం వ్యాపకంగా మొదలు పెట్టాడు. ఖాళీ సమయాల్లో దాన్ని పనిగా చేసుకొని మహనీయులు, రాజకీయ నేతల చిత్రాలను చెక్కుతూ అభిమానాన్ని చాటుకుంటున్నాడు.

అబ్బుర పరుస్తున్న యువకుడు

గంభీరావుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వ్యాపకంగా మొదలు పెట్టిన పని ఆ యువకుడికి ప్రత్యేక గుర్తింపును తెచ్చింది. గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన చేపూరి సంతోష్‌చారి అనే యువకుడు వృత్తి పరంగా వడ్రంగి. వృత్తి పనితోపాటు కర్రలపై చిత్రాలు చెక్కడం వ్యాపకంగా అలవాటు చేసుకున్నాడు. రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రాన్ని కర్రపై తీర్చి దిద్దాడు. ఇందుకోసం వారం రోజులుపాటు కష్ట పడ్డాడు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చిత్రాన్ని కర్రపై చెక్కి వార్తల్లోకి ఎక్కాడు. కేసీఆర్ చిత్రాన్ని స్వయంగా కేటీఆర్‌కు అందజేసి శభాష్ అనిపించుకున్నాడు. కర్రతో ఎడ్ల బండి టిపాయిని తీర్చి దిద్దాడు. ఇటీవల పుచ్చకాయపై ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రాన్ని చెక్కి అందరి దృష్టిని ఆకర్షించాడు.

ప్రత్యేకత చాటుకోవాలి : సంతోష్ చారీ



కర్రలపై చిత్రాలు చెక్కి ప్రత్యేకతను చాటుకోవాలన్నది నా లక్ష్యం. వృత్తిరీత్యా వడ్రంగి పని చేస్తున్న పుడు కర్రలపై రాజకీయ నేతలు, మహనీయుల చిత్రాలు చెక్కాలనే ఆలోచన వచ్చింది. అదే క్రమంలో చిత్రాలు చెక్కడం మొదలు పెట్టాను. ముందుగా కష్టం అనిపించినా ఇష్టంతో పని చేయడంతో సులువుగా మారింది.

కేసీఆర్‌ను తిట్టడం తప్ప ఈ ప్రభుత్వం చేసిందేమిటీ?

● సీఎం ఇలాకాలోనే ప్రజలు తిరగబడ్డారు

● మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గత పదకొండు మాసాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌ను తిట్టడం తప్ప ఏమిచేయలేదని, ముఖ్యమంత్రి సొంత ఇలాకాలోనే ప్రజలు తిరగబడ్డారని, విజయోత్సవాలకు వచ్చే మంత్రులు, ఎమ్మెల్యేలను నిలదీయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం పెద్దపల్లిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మోసపూరితమైన హామీలు ఇచ్చి 11 నెలల్లో చేసిందేమి లేదన్నారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ సాధించిన రాష్ట్ర అభివృద్ధిని పది నెలల్లోనే నాశనం చేశారని మండిపడ్డారు. పాలన పక్కకు పెట్టి కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని, సోషల్ మీడియాలో ప్రశ్నించే వారిపై అక్రమంగా కేసులు పెట్టి బెది రిస్తున్నారన్నారు.

ఈ ప్రభుత్వం ఏం చేసిందని విజయోత్సవాలు జరుపుతోందని అన్నారు. ఆరు గారంటీలు, 420 హామీల్లో ఏది పూర్తిగా నెరవేర్చారో ప్రజలకు చెప్పి సంబురాలు చేసుకోవాలన్నారు. కేసీఆర్ పాలనలో వ్యవసాయ రంగం దేశానికి ఆదర్శంగా నిలిచిందని, కాంగ్రెస్ ఇస్తానన్న రైతు భరోసా రాలేదని, రుణమాఫీ 40 శాతం మందికి చేసి 60 శాతం రైతులకు ఎగ్గొట్టారన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలు, పింఛన్లు పెంచుతామని ఇచ్చిన హామీలు నెరవేరాయా అని ప్రశ్నించారు. హైడ్రా పేరుతో వేల మందిని రోడ్డున పడేశారని, ధాన్యం కొనుగోలు చేసే పరిస్థితి లేదని రైతులు కల్లాల వద్ద ఎదురుచూస్తూ పడికాపులు కాస్తున్నారని, సన్న ధాన్యానికి బోనస్ ఇవ్వడం లేదన్నారు. దళితులకు రెండో విడత దళితబంధు ఇవ్వనందుకా? గురుకులాల్లో 37 మంది విద్యార్థులు చనిపోయినం దుకా? చేనేత కార్మికుల ఆత్మహత్యలు మళ్లీ ప్రారం భం అయినందుకా? కేసీఆర్‌ను తిట్టడం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏమిటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి పదవిలో వుండి బూతులు మాట్లాడే వ్యక్తిని ఇంతవరకు చూడలేదని, ఆ పదవికి రేవంత్ రెడ్డి కళంకం తెచ్చిన ఏకైక వ్యక్తి అని విమర్శించారు.

ముఖ్యమంత్రి సొంత ఇలాకాలో కలెక్టర్‌పై దాడి జరి గిందంటే అది ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు. పోలీసులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లాగా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి ప్రభు త్వాన్ని ఎన్నడూ చూడలేదని, ఇది శాంపిల్ మాత్రమేనని, దీనిని బట్టి చూస్తే కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులను గ్రామాల్లో తిరగనిచ్చే పరిస్థితి లేదన్నారు. విజయోత్సవాలకు వచ్చే నాయకులను హామీలపై నిలదీయాలని ఆయన ప్రజలను కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ విజయోత్సవాలను బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకిస్తున్నదని, రామగుండంలో చిరు వ్యాపారులకు రోడ్డున పడేసినందుకా, కాళేశ్వరం నీళ్లు రామగుండంలో లేకుండా చేసినందుకు సంబరాలు నిర్వహిస్తారా అని ప్రశ్నించారు. నవంబరు 14 నుంచి డిసెంబరు 9 వరకు బీఆర్ఎస్ నిరసన కార్యక్ర మాలను చేపడుతుందన్నారు.

మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయకుండా విజయోత్సవాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో సీఎం రేవంత్ రెడ్డి కట్టడాలు కులగొట్టడమే పాలనగా పాలిస్తున్నాడని విమర్శించారు. కొడంగల్‌లో కలెక్టర్‌పై దాడి దారుణమని, ప్రజలను భయభ్రాంతులను గురి చేస్తూ పాలిస్తున్నారన్నారు.. కాంగ్రెస్ నాయకులను నిలదీస్తే తప్ప హామీలు అమలుకావన్నారు.

మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కేవలం అధికారం వస్తే చాలు అన్నట్టుగా అమలు కాని హామీలను కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందన్నారు. ఇప్పటి వరకు ఒక్క హామీ పూర్తిగా అమలు కాలేదన్నారు. ధాన్యం కొలుగోల్లు జరగక ప్రతి గ్రామంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు, మహిళలకు, విద్యార్థులకు, నిరుద్యోగులకు, వృద్ధులకు, ఎవరికి హామీలు అమలు చేయలేదన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా విజయోత్సవాలు చేసుకోవడం ఏమిటని, రాష్ట్రం ఆర్థికంగా, అన్ని రకాలుగా దివాలా తీసేలా పాలిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రఘువీర్ సింగ్, పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పురాజ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బండారు శ్రీనివాస్, తగరం శంకర్‌లాల్, రాజు గౌడ్, అభిషేక్ రావు, ఎన్ మారుతి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో 'కార్తీక' రద్దీ



ధర్మపురిలో గోదావరి హారతి

ధర్మపురి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి పదకొండవ రోజు మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, ప్రత్యేక పూజలు చేసి హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, బొజ్జ రమేష్‌శర్మ, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, వేదపండితులు పాల్గొన్నారు.

కొండగట్టులో..

మల్యాల, (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామిని సన్నిధానం కార్తీక మాసం పురస్కరించుకొని మంగళవారం వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో రద్దీగా మారింది. మహిళ భక్తులు ఆలయం ముందు గల రావి చెట్టు వద్ద దీపాలు వెలిగించి కార్తీక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో రామకృష్ణరావు, ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ బేతాళుడి ఆలయంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ నాంపల్లి ఆధ్వర్యంలో భక్తుల రద్దీని పర్యవేక్షించారు.

రాజన్న ఆలయంలో..

వేములవాడ కల్చరల్,(ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా భక్తుల రద్దీ కొనసాగుతోంది. మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ముందు భాగంలో కార్తీక దీపాలను వెలిగించారు.



కొండగట్టులో భక్తుల పూజలు

నరసింహాస్వామి ఆలయానికి వెండి మకర తోరణం అందజేత



నరసింహాస్వామికి వెండి మకర తోరణం అందిస్తున్న దాతలు

బీర్‌పూర్,నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బీర్‌పూర్ లక్ష్మీనరసింహాస్వామి ఆలయానికి మంగళవారం 6 కిలోల వెండితో చేసిన మకర తోరణాన్ని దాతలు అందించారు. బీర్‌పూర్ గ్రామానికి చెందిన వంగపల్లి సీతమ్మ జగ్గారావు కుటింబీకులు విరాళంగా అందించారు. మకర తోరణం కైంకర్యం విలువ రూపాయలు 6లక్షల 20 వేలు ఉంటుందని ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. దాతలను ఆలయ సిబ్బంది సన్మానించారు.

బద్దిపోచమ్మకు బోనాలు



బద్దిపోచమ్మ ఆలయం వద్ద బోనాలతో భక్తుల క్యూ

వేములవాడ కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ బద్దిపోచమ్మకు మంగళవారం భారీసంఖ్యలో భక్తులు బోనాలు సమర్పించారు. సోమవారం రాజరాజేశ్వరస్వామి వారిని దర్శిం చుకున్న భక్తు లు మంగళవారం తెల్లవారు జామున మట్టి పాత్రల్లో అమ్మవారికి నైవేద్యాన్ని వండుకొని డప్పుచప్పుళ్లు, శివసత్తుల నృత్యాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో క్యూలైన్‌లో రద్దీ నెలకొంది. సుమారు మూడు గంటలపాటు భక్తులు నెత్తిన బోనాలతో నిరీక్షించారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి పట్నాలను వేసి నైవేద్యాన్ని సమర్పించి ఒడిబియ్యం పోశారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సెల్ఫ్ డిఫెన్స్ శిక్షకుల దరఖాస్తు గడువును ఈనెల 16వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా యువజన క్రీడాల శాఖ అధికారి బి శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలో 2024-25 సంవత్సరానికి సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాం కింద 169 పాఠశాలలు ఎంపిక చేశామన్నారు. ఈ పాఠశాలల్లో నవంబరు నుంచి జనవరి 25 వరకు మూడు నెలలపాటు 36 సెల్ఫ్‌డిఫెన్స్ తరగతులు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కార్యాలయ పని దినాలలో దరఖాస్తులను డీవైఎస్‌వో కార్యాలయంలో అందచేయాలని కోరారు.

రతన్‌టాటాకు నివాళి

కరీంనగర్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రతన్‌టాటా అసాధారణ సేవలను కీర్తిస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలోని అద్విత ఇంటర్నేషనల్ స్కూల్ ప్రత్యేక అసెంబ్లీ నిర్వహించి ఘనంగా నివాళులర్పించింది. రతన్‌టాటా జీవితంలోని ముఖ్య ఘట్టాలను ప్రతిబింబించే ఆకర్షణీయమైన పోస్టర్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ అనుదీప్ సౌగాని, ప్రిన్సిపల్ మధురి శ్వేత పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తా'

సుభాష్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను సీఎంఆర్ ఫౌండేషన్ ద్వారా వేయి పాఠశాలల్లో పలు కార్యక్రమాలు నిర్వహించామన్నారు. పీఆర్‌టీయూ సంఘం ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పాటుపడిందన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ వంగ మహేందర్‌రెడ్డిని పీఆర్‌టీయూ బలపరుస్తుందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్రి జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'యువత రాజకీయాల్లోకి రావాలి'

సుభాష్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యువత రాజకీయాల్లోకి రావాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మదనం గంగాధర్ అన్నారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను ప్రజలకు సేవ చేయాలని డీఎస్పీ ఉద్యోగానికి రాజీనామా చేశానన్నారు. సమావేశంలో ఆంజనేయులు, కరుణాకర్, నారాయణ పాల్గొన్నారు.

'యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి'



మాట్లాడుతున్న చలిమెడ రాజేశ్వర్‌రావు

గణేశ్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని చలిమెడ రాజేశ్వర్ రావు అన్నారు. ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ డెయిరీ పరిశ్రమ ద్వారా తాను వేల మందికి ఉపాధి కల్పిస్తున్నానని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు వికసిత్ భారత్‌లో భవిష్యత్తు ఔత్సాహికులు గా మారాలని పేర్కొన్నారు. స్వదేశి జాగరణ మంచ్ రాష్ట్ర కోఆర్డినేటర్, సీఏ హరీశ్‌బాబు మాట్లాడుతూ ట్రిలియన్ ఎకానమీ వ్యవస్థలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని, స్వావలంబనే అంతిమ లక్ష్యం కావాలని సూచించారు. సదస్సులో సి.హెచ్ రమణమూర్తి, తిరుమల ఇండస్ట్రీస్ ఎండి ఎం.రథేష్, చిటీ మాధవరావు, ఎం.దామోదర్‌రెడ్డి విద్యార్థులకు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై పలు సూచనలు చేశారు. కళాశాల ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ విభాగం కోఆర్డినేటర్ డా.బూర్ల నరేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాలను సృష్టించే స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్, కామర్స్ విభాగాధిపతి రాజయ్య, ఐక్యూఏసి సమన్వయకర్త డాక్టర్ హర్జ్యోత్‌కౌర్, విభాగం కోఆర్డినేటర్ డా. బూర్ల నరేష్, సభ్యులు డా.ప్రభాకర్, శ్రీనివాస్, స్టాఫ్ క్లబ్ సెక్రెటరీ డాక్టర్ ఎం శ్రీనివాస్ రెడ్డి, వివిధ విభాగాల అధ్యాపకులు, కామర్స్ విభాగం అధ్యాపకులు డా. ఎం. మల్లారెడ్డి, రామకృష్ణ, డాక్టర్ అర్జున్, ఎం.శిరీష, అరవింద్ నర్మద, ఐలయ్య, మల్లేశం పాల్గొన్నారు.

న్యుమోనియాపై అప్రమత్తంగా ఉండాలి

సుభాష్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): న్యుమోనియాపై అప్రమత్తంగా ఉండాలని మెడికవర్ డాక్టర్లు సూచించారు. దగ్గు, తుమ్ముల ద్వారా శ్వాసకోశ వ్యవస్థకు వేగంగా వ్యాపిస్తుందన్నారు. మంగళవారం వరల్డ్ న్యుమోనియా డే సందర్భంగా మెడికవర్ ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ దగ్గు, జలుబు అని నిర్లక్ష్యం చేయకుండా త్వరగా ఆసుపత్రికి వస్తే నయం చేయవచ్చన్నారు. వాతావరణంలో మార్పులు, వాయు కాలుష్యంతో పాటు ఇమ్యూనిటీ శక్తి తక్కువగా ఉండేవారికి ఈ వ్యాధి సోకుతుందన్నారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే గర్భవతులు న్యుమోనియా బారిన పడితే కడుపులో బిడ్డకు కూడా సోకి నెలలు నిండకముందే ప్రసవం అయ్యే ప్రమాదముందన్నారు. దగ్గు, జలుబు, ఆయాసం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, గుండె వేగంగా కొట్టుకోవడం, జ్వరం, వణుకు, ఛాతినొప్పి వంటి న్యుమోనియా లక్షణాలు ఉంటే స్వంత చికిత్స తీసుకోకుండా డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. వ్యాధి బారిన పడకుండా మాస్కు ధరించాలని సూచించారు. కార్యక్రమంలో సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, డాక్టర్లు నాగ రాజు, డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, డాక్టర్ ప్రతిష్ఠారావు, డాక్టర్ సత్యనారాయణ, సూపరిం టెండెంట్ డాక్టర్ రవి మాల్లరెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

సుభాష్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మంకమ్మతోట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మంగళవారం ఎస్‌ఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించిన ఈ ఉచిత వైద్యశిబిరంలో పలువురికి ప్రీడయాబెటిక్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, క్లబ్ అధ్యక్షుడు బూర్ల విద్యాసాగర్, కార్యదర్శి అంబటి రవీందర్‌రాజు, కోశాధికారి పాత విశ్వనాథం, జిల్లా అంజయ్య, జిల్లా కృష్ణమూర్తి, రంగు చెన్నయ్య, సీతారాంరెడ్డి, సల్వాజి తిరుపతి, జె శంకరయ్య పాల్గొన్నారు.

● నగరంలోని 59వ డివిజన్‌లో ఆరోగ్య మహిళ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గందె మహేశ్, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ సాహితి, డాక్టర్ సురేందర్, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, ప్రశాంత్, ఏఎన్‌ఎం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి'

కరీంగనర్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):: నగర పాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, వాహనాల డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఆర్‌టియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు చేపట్టిన ఈ ధర్నా కార్యక్రమంలో బీఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మహిళా కార్మికులకు నాణ్యమైన చీపుర్లను ఇవ్వాలని, ట్రాక్టర్లు, స్వచ్ఛ ఆటోలకు టైర్లు, ఆయిల్ మార్పిడి చేయించాలని డిమాండ్ చేశారు. ధర్నా చేస్తున్న సమయంలో అడిషనల్ కమిషనర్ సువార్త కార్మికులను మీ ఉద్యోగాలను తీసేస్తానని బెదిరిస్తూ వెళ్ళిపోయారని ఆయన ఆరోపించారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్ కార్మికుల వద్దకు వచ్చి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ ధర్నాలో నాయకులు గడ్డం సంపత్, పొన్నం లింగయ్య, గాలి శ్రీనివాస్, పార్నంది ఎల్లయ్య, భద్రకంటి రవి, బొల్లి రాజేశ్, కోనేటి సమ్మయ్య, మాతంగి స్వామి, తాడె చంద్రకళ, రాజేశ్వరి, సునంద, గాజుల రాజేశ్వరి, జిల్లాల అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణస్వామి వ్రతాలు


వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రాంనగర్ రమాసత్యనారాయణస్వామి దేవాలయంలో కార్తీక మాసం సందర్భంగా మంగళవారం ఏకాదశి తిథిని పురస్కరించుకొని సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. ఈ మాసంలో ప్రతీ రోజూ ఓ బ్యాచ్ చొప్పున వ్రతాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం జరిగిన వ్రతాల్లో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున రాజేందర్ దంపతులతో పాటు అర్చకులు తిరునహరి ప్రవీణ్‌కుమార్, బహిరి అనిల్‌కుమార్, పలువురు ఆలయ కమిటీ బాధ్యులు, దంపతులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి


విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళ వారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో నిర్వహిం చిన అల్ఫోర్స్ కిడ్స్ న్యాక్ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక దశ నుండే సృజనాత్మకతతో పాటు ఆలోచన విధానాన్ని పెంపొందించాలన్నారు. విద్యార్థులకు వార్షిక ప్రణాళికలో భాగంగా ఎన్నో విషయాలను నేర్పాల్సిన అవసరముందన్నారు. విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు 3, 4, 5 తరగతుల విద్యార్థులకు కార్యక్రమం నిర్వహించామన్నారు. సమాజంలో ప్రభావితం చేసే పలు అంశాలను విద్యార్థులుకళ్లకు కట్టినట్లు ప్రదర్శించడం అభినంద నీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులుపాల్గొన్నారు.

'ఎరుకల కులస్థులను ప్రభుత్వం ఆదుకోవాలి'

సుభాష్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పందుల పెంపకందారులకు ప్రతి కుటుంబానికి 5 గుంటల భూమి ఇచ్చి ఆదుకోవాలని తెలంగాణ ఎరుకల ప్రజాసమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎమసారం తిరుపతి డిమాండ్ చేశారు. మంగళవారం సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట దీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.500 కోట్ల నిధులు కేటాయించాలన్నారు. ఈ దీక్షలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ఉపేందర్, జిల్లా గౌరవ అధ్యక్షులు కుర్ర సమ్మయ్య, జిల్లా అధ్యక్షుడు లోకిని పోచయ్య పాల్గొన్నారు.

గురుకుల కళాశాలకు పుస్తకాల వితరణ

కరీంనగర్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు ఎర్రోజు వెంకటేశ్వర్లు రచించిన బ్లాక్ బోర్డు వచన కవిత సంపూటి యర్రోజు పసిడి పలుకు శతకం ప్రిన్సిపల్ మాలతి సమక్షంలో కళాశాల గ్రంథాలయానికి అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సమత, సురేష్ కుమార్, లలిత, కవిత, రేణుక, గీతారాణి, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు..

(5వ పేజీ తరువాయి)

రూపాయల బోనస్‌ను రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని నిర్ణయించింది.

● **కొనుగోళ్లలో జాప్యంతో ప్రైవేట్ వ్యాపారులకు అమ్మకం**

కస్టమ్ మిల్లింగ్ ధర పెంచడం, ధాన్యం కేటాయించడానికి మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ, సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించడం అంశాలపై ప్రభుత్వానికి మిల్లర్లకు మధ్య అవగాహన కుదరని కారణంగా 40రోజుల క్రితమే వరి కోతలు ప్రారంభమై ధాన్యం కేంద్రాలకు వస్తున్నా వాటిని కొనే వారే లేకుండా పోయారు. వర్షం భయం, ఎప్పుడు ధాన్యం కొనుగోలు చేస్తారో స్పష్టత రాకపోవడంతో 1,800 నుంచి 1,950 రూపాయల వరకు క్వింటాల్ ధాన్యాన్ని రైతులు ప్రైవేట్‌గా అమ్ముకున్నారు. అక్టోబరులో దిగుబడిలో 23 శాతం ధాన్యం 91,894 మెట్రిక్ టన్నులు, నవంబర్‌లో 58 శాతం 2,34,029 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువస్తారని అధికారులు అంచనా వేశారు.

లాడ్జీల్లో పోలీసుల తనిఖీలు

కరీంనగర్ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని పలు లాడ్జీల్లో మంగళవారం రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. వన్ టౌన్ సీఐ బిల్లా కోటేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు పలు లాడ్జీల్లో బస చేసిన వారిని ఫింగర్ ప్రింట్ డివైస్‌తో తనిఖీ చేశారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారణ అనంతరం వదిలిపెట్టారు. నేరస్తులు లాడ్జీల్లో ఆశ్రయం తీసుకుని దొంగతనాలు, ఇతర నేర ఘటనలకు పాల్పడే అవకాశం ఉన్నందున ఆకస్మిక తనిఖీలు నిర్వహించామని పోలీసులు తెలిపారు.

అంధకారంలో ఎల్‌ఎండీ

-అలంకారప్రాయంగా విద్యుత్ దీపాలు

-ఇబ్బందులు పడుతున్న వాకర్స్

కరీంనగర్ అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని దిగువ మానేరు జలాశయం కట్టపై విద్యుత్ దీపాలు అలంకారప్రాయంగా మిగిలిపోయాయి. విద్యుత్ దీపాలు నెలలుగా వెలగడం లేదు. దీంతో వేకువ జామున వాకింగ్‌కు వెళుతున్న వాకర్స్ తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకిరువైపులా సర్కార్ తుమ్మ చెట్లతో దారి మూసుకుపోయి ప్రమాదకరంగా తయారైంది. ఈ విషయాన్ని వాకర్స్ స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారులకు తెలియజేసినప్పటికీ ఎవరూ పట్టించుకోవటంలేదు. ఇటీవల కొందరు వాకర్స్‌పై కుక్కలు దాడి చేశాయి. కొన్ని సందర్భాల్లో పాములు, తేళ్లు వాకర్స్‌కు కనిపించడంతో ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కట్ట కింది భాగంలో ట్రాన్స్‌కో అధికారులు ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించి వదిలేశారు. సంబంధిత అధికారులు స్పందించి కట్టపై విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేయాలని, ఇరువైపుల చెట్లను, చెత్తను తొలగించాలని వాకర్స్ కోరుతున్నారు.

వృద్ధాశ్రమానికి ఆర్థిక సహాయం

గణేశ్‌నగర్, నవంబరు 12(ఆంధజ్యోతి): కరీంనగర్ ఎస్పీడీసీఎల్ సర్కిల్ ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధాశ్రమానికి 20,000 రూపాయల చెక్కును నిర్వాహకులు సిపెల్లి వీరమాధవ్‌కు ఎస్ఈ మేక రమేష్ బాబు, డిఈటి పి. విజయేందర్ రెడ్డి,డిఈ జంపాల రాజం తదితరులు చెక్కును అందించారు. అనంతరం ఎస్ఈ మాట్లాడుతూ టీజీ ఎన్పీడీసీఎల్ చారిటబుల్ ట్రస్ట్ ప్రత్యేకంగా సహాయ నిధిని ఏర్పాటు చేసి ప్రతి నెల కొంత మొత్తాన్ని పోగుచేసి అందిస్తున్నామన్నారు.

'వికారాబాద్ కలెక్టర్‌పై దాడి అమానుషం'

కరీంనగర్ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఫార్మా కంపెనీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్ళిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర అధికారులు, ఉద్యోగులపై గ్రామస్థులు దాడి చేయడం అమానుషమని తెలంగాణ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి ఫయాజ్ అలీ, ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ నాగేందర్‌సింగ్ ఒక సంయుక్త ప్రకటనలో ఖండించారు. అధికారులు, ఉద్యోగులు ప్రభుత్వ విధానాలను అమలు చేసే వారు మాత్రమేనని ప్రజలు గ్రహించాలని కోరారు. అభ్యంతరాలుంటే ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలే తప్ప ఇలా దాడులు చేయడం సరికాదని పేర్కొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 12: నగరంలోని శివకేశవ ఆలయాల్లో మంగళవారం శ్రీమహావిష్ణువు యోగ నిద్ర నుంచి మేల్కొనే ఉత్థాన ప్రబోధినీ ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయాలను సందర్శించి ప్రత్యేక అభిషేక పూజలు, పారాయణాలతో పాటు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆకాశ దీపోత్సవం, దీపారాధనల్లో పాల్గొన్నారు.

●స్థానిక పాతబజార్ దక్షిణాభిముఖ ప్రాచీన చిన్న హనుమాన్ దేవాలయంలో నూతనంగా జరిగిన శివ పంచాయతన ప్రతిష్ఠ అనంతరం కార్తీక ఏకాదశి సందర్భంగా మంగళవారం విశేష పూజలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు వానమామలై శ్రీధరాచార్యులు, పురోహితుడు మంగళంపల్లి శ్రీనివాసశర్మ, కౌశిక్ ఆచార్య, భక్తులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా గూడూరి రాజేశ్వరి


గూడూరి రాజేశ్వరి

హుజూరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఇప్పల్‌నర్సింగాపూర్‌కు చెందిన గూడూరి రాజేశ్వరిని నియమిస్తూ మంగళవారం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. వైస్ చైర్మన్‌గా నాంపెల్లి తిరుపతి, సభ్యులుగా పెరుమాండ్ల భిక్షపతి, పానుగంటి కిరణ్, సమ్మెట సంపత్‌కుమార్, బండారి సదానందం, మండ సమ్మిరెడ్డి, తునికి రవి, దుబాసి బాబు, లోకిని రాజు, గోస్కుల రాజయ్య, ఎండీ చాంద్‌పాషా, భూపతి కుమారస్వామి, తనుకు ప్రభాకర్‌ను నియమించారు. తమ నియామకానికి సహకరించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌కు గూడూరి రాజేశ్వరి, పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సౌర విద్యుత్‌తో పర్యావరణ పరిరక్షణ

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 12: సౌర విద్యుత్‌తో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని నేషనల్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీ కార్పొరేషన్ హైద్రాబాద్ డిప్యూటి మేనేజర్ ఇంజనీర్ ముత్తుకుమారన్ అన్నారు. మండలంలోని సింగాపూర్ కిట్స్‌లో రీసెంట్ అడ్వాన్స్ ఇన్ ఎనర్జీ సిస్టమ్స్ ఫర్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో ఆయన మాట్లాడారు. సౌర విద్యుత్‌ను సామాన్య ప్రజలకు చేరువ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో నాగాపూర్ ఎన్ఐటీ ప్రొఫెసర్ విశ్వేశ్వరయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రామ్‌షా, ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాల బారిన పడవద్దు

చొప్పదండి.నవంబరు 12: (ఆంధ్రజ్యోతి) యువత మత్తు పదార్థాల బారిన పడవద్దని, భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ ఎస్సై విజయభాస్కర్ అన్నారు. మంగళవారం మండలంలోని రాగంపేట జడ్పీ హైస్కూల్‌లో మత్తు పదార్థాలపైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్‌లో కాన్సియస్నెస్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు.

● సైదాపూర్: మండలంలోని ఎక్లాస్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకుఎక్సైజ్ అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా..?


గుంతలమయంగా మారిన వెలిచాల బైపాస్ రోడ్డు

రామడుగు, నవంబరు 12: మండలంలోని వెలిచాల బైపాస్ రోడు గుంతలమయంగా మారింది. రహదారిపై భారీ గుంతలు ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కొనసాగుతున్న సమగ్ర సర్వే

ఇల్లందకుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాములపల్లె, వాగొడ్డురామన్నపల్లె గ్రామాల్లో ఇంటింటికి కుటుంబ సమగ్ర సర్వే మంగళవారం నిర్వహించారు. సందర్భంగా ప్రత్యేకాధికారి కమలాకర్‌రెడ్డి, తహసీల్దార్ రాణి, ఎంపీడీవో పుల్లయ్య, ఎంపీవో రాజేశ్వర్‌రావులు సర్వే జరుగున్న తీరును పరిశీలించారు.

● శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గుడాటిపల్లెలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను తహసీల్దార్ భాస్కర్ మంగళవారం పరిశీలించారు. సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ మల్లేశం, ఎంపీఎస్‌వో రాధా ఉన్నారు.

బీజేపీ సంస్థాగత వర్క్‌షాప్‌లు

హుజూరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బీజేపీ సంస్థగత వర్క్‌షాప్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు కొంరయ్య మాట్లాడుతూ బూత్ స్థాయి నాయకులు కనీసం వంద సభ్యత్వాలు చేయాలన్నారు.

● రామడుగు బీజేపీని బూత్ స్థాయి నుంచి పటిష్టం చేయాలని ఆ పార్టీ జిల్లా ప్ర ధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వర్క్‌షాపును నిర్వహించారు. కార్యక్రమంలో రాంకిషన్, నరేష్, నర్సింగరావు, అంజిబాబు పాల్గొన్నారు.

రేకుల షెడ్ కూల్చివేత

జమ్మికుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 28వ వార్డులో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్మించిన రేకుల షెడ్‌ను మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ మంగళవారం తన సిబ్బందితో కూల్చివేయించారు. పలువురి ఫిర్యాదు మేరకు రేకుల షెడ్‌ను కూల్చి వేయించినట్లు కమిషనర్ తెలిపారు. కౌన్సిలర్ కల్వల దీప్తి-కిషన్‌రెడ్డి మాట్లాడుతూ గణేష్ మండపాన్ని కూల్చి వేయించడం బాధాకరమన్నారు.

ఇల్లందకుంట ఆలయంలో ఆకాశ దీపోత్సవం


ఆకాశదీపోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఇల్లందకుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆకాశ దీపోత్సవ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా భాగంగా సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు శేషం వంశీధరాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆకాశ దీపోత్సవం నిర్వహించగా మహిళలు పెద్దఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

పల్లెల్లో పారిశుధ్యంపై పట్టింపేది..?

వీణవంక నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో పారిశుధ్యం ప్రత్యేక అధికారుల పాలన పడకేసింది. గ్రామల్లో ఎక్కడ చూసినా చెత్త చెదారంతో నిండిన డ్రైనేజీలు కనిపిస్తున్నాయి. ప్రత్యేకాధికారులు గ్రామాలకు అడపాదడపా వస్తున్నారు. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం దెబ్బతిన్నది. వీధి దీపాలు రోజంతా వెలుగుతున్నా పట్టించుకునేవారు లేదు. ప్రత్యేకాధికారులు అందుబాటులో ఉండకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. అధికారులు గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.

గురుకులంలో కొనసాగుతున్న ఆటల పోటీలు

మానకొండూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవంపల్లి గురుకుల పాఠశాలలో పదో జోనల్ స్థాయి ఆటల పోటీలు మంగళవారం కొనసాగాయి. రెండో రోజు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ క్రీడలు జరిగాయి. మల్టీజోనల్ అధికారి కె అలివేలు క్రీడా పోటీలను సందర్శించారు. 14 పాఠశాలలకు చెందిన 1,190 మంది క్రీడాకారులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని అన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఆమె విద్యార్థులకు సూచించారు.

ఉద్యోగులపై దాడి చేసిన వారిని శిక్షించాలి


తహసీల్దార్ కార్యాలయం ఎదుట దర్నా చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

హుజూరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ కలెక్టర్, అదనపు కలెక్టర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలని రెవెన్యూ సిబ్బంది డిమాండ్ చేశారు. దాడిని నిరసిస్తూ హుజూరాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెవెన్యూ సిబ్బంది మంగళవారం ధర్నా నిర్వహించారు. ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ కనకయ్య, ఆర్ఐ రంజిత్, సిబ్బంది శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ చౌర్యం చేస్తే కఠిన చర్యలు'

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 12: విద్యుత్ చౌర్యం చేస్తు కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. మండలంలోని చెల్పూర్ గ్రామంలో విద్యుత్ శాఖాధికారులు మంగళవారం పోల్ టూ పోల్ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రూరల్ ఏఈ జనార్దన్ మాట్లాడుతూ విద్యుత్ కనెక్షన్ లేని వారు మీటర్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 938 రూపాయలకు మీటర్ ఇస్తున్నామని తెలిపారు. బిల్లులను సకాలంలో చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో డీపీఏఈ రాములు, ఏఈలు సంపత్‌రెడ్డి, రఘుచారి, ఫోర్‌మెన్ సంజీవ్‌రావు, ఎస్ఎల్ఐ రాజిరెడ్డి, లైన్ ఇన్స్‌పెక్టర్ రామంచ సమ్మయ్య, శ్రీనివాస్, లైన్‌మెన్‌లు ఐలేష్, కనకయ్య, ఏఎల్ఎంలు అంబాల వెంకటేశ్వర్లు, శరత్‌రెడ్డి, తిరుపతి, గణేష్, చింతల్ మహేందర్ పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గంగాధర, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి శ్వేత అన్నారు. మంగళవారం మండలంలోని గర్షకుర్తిలో ఆరోగ్య మహిళ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు నాన్ కమ్యూనికేబుల్ వ్యాధుల స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమం లో గ్రామ పల్లె దవాఖాన వైద్యాధికారి సుమన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

గన్నేరువరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గుండ్లపల్లి గురుకుల పాఠశాల విద్యార్థులకు విద్యార్థులకు శాంతి పోస్టర్‌పై చిత్రలేఖనం పోటీలను మంగళవారం నిర్వహించారు. ప్రతిభ కనబరిన విద్యార్థులకు డిస్ట్రిక్ట్ లియో క్లబ్ అడ్వైజర్ బూర శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బూర రామకృష్ణ, సభ్యులు జీల ఎల్లయ్య, గంప వెంకన్న, తేల్ల భాస్కర్, కిషన్‌రెడ్డి, రవిందర్ పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనం నడిపిన వారికి జరిమానా

శంకరపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడిపిన వారికి కోర్టు జరిమానా విధించింది. ఇటీవల కేశవపట్నంలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురిని పట్టుకుని హుజూరాబాద్ కోర్టులో హాజరు పరిచామని ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు. సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఈశ్వరయ్య వారు 3,500 రూపాయల జరిమానా విధించారని చెప్పారు.

విదేశాల్లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

సైదాపూర్, నవంబరు 12: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) సంస్థ విదేశాల్లో ఉద్యోగాల కోసం అర్హత గల అభ్యర్థ నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో యాదగిరి ఓ ప్రకటనలో తెలిపారు. అధిక డిమాండ్ ఉన్న జాబ్ రోల్స్ ఆరోగ్య సంరక్షణ రంగంలో రిజిస్టర్డ్ నర్సు, వృద్ధుల సంరక్షణ నర్సు, హెల్త్‌కేర్ అసిస్టెంట్ ఉద్యోగాలు ఉన్నాయన్నారు. నాన్ హెల్త్ కేర్ సెక్టార్‌లో ఆటోమోటివ్ టెక్నీషియన్, ఎలక్ట్రీషియన్, హెవీ మోటర్ వెహికిల్ డ్రైవర్, ఫుడ్ డెలివరీ సిబ్బంది, కార్పెంటర్లు, హాస్పిటాలిటీ (హౌస్ కీపింగ్, వెయిటర్లు, కిచన్ స్టాఫ్, గార్డనర్), నిర్మాణ రంగాల్లో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ, ఏదైన డిగ్రీ, జీఎన్ఎం లేదా నర్సింగ్ చేసి ఉండాలన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు అర్హులని తెలిపారు. ఆసక్తి అభ్యర్థులు వివరాల కోసం టామ్ కామ్‌ను సంప్రదించాలని సూచించారు. అభ్యర్థులకు టామ్‌కామ్ సంస్థ విదేశీ భాషలపై శిక్షణ అందిస్తుందన్నారు. అర్హతలు ఉండి ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 11న ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.